క్లుప్తంగా

20న వేదశాస్త్ర పరిషత్ వేద సభ

బోట్‌క్లబ్: శ్రీమత్ ఆంధ్ర వేద శాస్త్ర పరిషత్ 71వ వసంతాల వేద సభ ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక రామారావుపేటలో ఉన్న గాయత్రి మండపంలో నిర్వహించనున్నట్టు పరిషత్ అధ్యక్షుడు శ్రీరామ భగవతి శనివారం విలేకర్లకు తెలిపారు. రాజమహేంద్రవరం దత్తాత్రేయ వేద గురుకుల ప్రధానోపాధ్యాయులు భారత జ్యోతి అవార్డు గ్రహీత గొల్లపల్లి సీతారామచంద్ర ఘనాపాఠి ఆధ్వర్యంలో వేదస్వస్తి కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ పాల్గొంటారన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేదలకు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ప్రతి నెలా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా పేదలు, వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేసినట్టు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, డాక్టరు శిరీష, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాధివాసం



సీతారామపురంలో విజయ కనకదుర్గాదేవి అమ్మవారికి క్షీరాధివాసం చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు: శ్రీవిజయకనక దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం విశేష పూజలు నిర్వహించారు. కోరంగి పంచాయతీ సీతారామపురం కోలాటివారి రేవు వద్ద ఆత్రేయ గోదావరి చెంతన నిర్మించిన ఆలయంలో గ్రామ పురోహితుడు కందికొండ భాస్కరశర్మ నేతృత్వంలో వేద పండితులు విఘ్నేశ్వర పూజ, మండప పునఃపూజలు, లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హోమం, జలాధివాసం, క్షీరాధివాసం, వాస్తు హోమం, ప్రధాన దేవతా హోమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మండల నాయకులు టి.లక్ష్మణరావు, బూరిబాబు, రామలక్ష్మి, చంటి, బాబి తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 7.16 గంటలకు శ్రీవిజయ కనకదుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

నేడు లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ

జి.వేమవరం రామాలయం వీధిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఉదయం లక్ష్మీగణపతి పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుంది. శనివారం వేదపండితుడు సత్యనారాయణ శర్మ నేతృత్వంలో వాస్తుపూజ, ధాన్యాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆరుతడి సాగుపై రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పంపిణీ చేసిన భూమిలో నీటి పరిమాణం కొలిచే గొట్టాలతో రైతులు

గోకవరం: మండలంలో కామరాజుపేటలో రైతులకు శనివారం ఆరుతడి పద్ధతిపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటీఎల్ బసవన్నగౌడ్, ఎన్ఎఫ్ఎంటీఎల్ దేవి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరుతడి విధానాన్ని అనుసంధానం చేయడం వలన అధిగ దిగుబడులు సాధించవచ్చన్నారు. తద్వారా మంచి లాభాలతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. పంటలపై క్షేత్ర స్థాయిలో బయోచార్, భూమిలో నీటి పరిమాణం కొలిచే విధానం, వివిధ రకాల కషాయాల తయారీ, డ్రోన్ వినియోగం తదితర అంశాలను వివరించారు. అనంతరం రైతులకు భూమిలో నీటి పరిమాణం కొలిచే గొట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారాలు నష్టపోతున్నాం

యానాం: పోలీసులు యానాం పట్టణంలో ప్రవేశించే వాహనాలపై కేసులు నమోదు చేస్తుండటంతో సరిహద్దు ఆంధ్రా ప్రాంతం నుంచి ఎవరూ పట్టణంలోకి రాని పరిస్థితి నెలకొందని, దీంతో తాము వ్యాపారాలను నష్టపోతున్నట్లు పలువురు వ్యాపారులు శనివారం ఎస్పీ చింతా కోదండరామ్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి శనివారం స్టేషన్‌లో నిర్వహించే మక్కల్ మంద్రం కార్యక్రమంలో వర్తకులు పాల్గొన్నారు. పట్టణంలో వ్యాపారాలు సాగాలంటే ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చే వర్తకులే తమకు ప్రధాన ఆధారమని, యానాంలో ప్రవేశించే వివిధ వాహనదారులపై ట్రాఫిక్ పేర కేసులు నమోదు చేస్తున్నారని, దీంతో వారు భయపడి పట్టణంలోకి రావడం లేదన్నారు. ఇప్పటికే పలు వ్యాపార సంస్థలు యానాం బైపాస్ రహదారికి వెళ్లిపోయాయని, విద్యుత్ చార్జీలు, షాపుల అద్దెలు భారంగా మారాయని, దీనికి తోడు పోలీసులు కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎస్పీని వారు కోరారు. సమావేశంలో వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాట

- పూర్తవుతున్న ఖరీఫ్ పనులు
- కాలి బాటలకు అధిక ప్రాధాన్యం
- ఎకరానికి 5, 6 బస్తాల అదనపు దిగుబడి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



కరపలో వరినాట్లు వేసిన పొలంలో కాలిబాటలు వేస్తున్న రైతు

కరప: ఖరీఫ్ పనులు సాగుతున్నాయి. రైతులు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. అధిక లాభాల కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రైతులు అదనపు పెట్టుబడి ఎందుకని భావించకుండా పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే అధిక దిగుబడిని పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. ఒక ఎకరా విస్తీర్ణంలో కాలిబాటలు వేయడానికి రూ.1,800 ఖర్చు కూడా అవదు. కానీ దానివల్ల లాభాలే ఉంటాయి. కాలిబాటల వలన మూడు నుంచి అయిదు బస్తాలు దిగుబడిని అధిక పొందవచ్చని కరప మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిశెట్టి సత్య సూచించారు. సార్వా సీజన్‌లో వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయని, కాలిబాటలు వేసుకోవాలని సూచనలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ఆమె గ్రామాల్లో పర్యటించి రైతులకు కాలిబాటలు వలన కలిగే ప్రయోజనాలు వివరించారు.

కాలిబాటలు వేసేది ఇలా

వరినాట్లు వేసిన పొలంలో తాడుకట్టి అడుగు వెడల్పుతో వరినాట్లు తీస్తారు. అలా తీసిన మూనలు ఖాళీల్లో నాటుతారు. తీసిన మూనలు కూడా ఖాళీలలో నాటడం వల్ల నష్టం కూడా ఉండదు. అదే వెదజల్లిన పొలంలో విత్తనాలు చల్లిన తర్వాత తాడుకట్టి అడుగు వెడల్పు ఉండే చెక్కను



కూరాడలో వెదజల్లిన పొలంలో తీసిన కాలిబాటలు

కర్రకు కట్టి లాగుతున్నారు. ఇలా లాగడం వల్ల బాటలో ఉండే విత్తనాలు పక్కకుపోయి బాటలు ఏర్పడతాయి. ప్రతిరెండు మీటర్లకు ఒక అడుగు వెడల్పున, గట్ల పక్క నుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా బాటలు వేయాలి.

ప్రయోజనాలు

పొలంలో కాలి బాటలు తీయడం వల్ల వరి మొదళ్లకు గాలి, వెలుతురు బాగా తగులుతుంది. చీడపీడలు ఆశించకుండా ఉంటాయి. బాటలకు ఇరుపక్కలా ఉన్న కుదురులు అధికంగా పిలకలు తొడిగి, దుబ్బు బాగా చేస్తుంది. ప్రతిరోజూ బాటలు వెంబడి నడుస్తూ పంట తెగుళ్ల గుర్తించేందుకు, కలుపు మొక్కలు తీయడానికి వీలుగా ఉంటుంది.

రసాయనిక ఎరువులు సమర్థవంతంగా జల్లుకోవడానికి అవకాశం ఉంటుంది. చీడపీడలు ఆశించినప్పుడు, సస్యరక్షణ చేయాల్సిన అవసరముంటే ముందుగా తెగులుసోకిన చోట మందులను పిచికారీ చేసి తదుపరి మిగిలినచోట చేయవచ్చు. బాటలు వెంబడి ఎలుకల నివారణ చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. ప్రతిరోజు పొలంలో కాలిబాటలలో నడుస్తూ వరిపంటను సమగ్రంగా పరిశీలించవచ్చు. బాటలు పక్కన ఉన్న దుబ్బులకు గాలి, వెలుతురు బాగా తగలడంవల్ల మూడు, నాలుగు పిలకలు అధికంగా చేయడంతో పాటు, బాటలు వెంబడి తీసిన మూనలు ఖాళీ స్థలంలో ఊడ్చడం వల్ల ఎకరానికి 5 నుంచి 6బస్తాల ధాన్యం దిగుబడిని అదనంగా పొందవచ్చని సూచించారు.

కాలిబాటలతో అదనపు దిగుబడి



సార్వాలో వరినాట్ల ప్రక్రియ దాదాపు పూర్తయింది. పొలంలో కాలిబాటలు తీయిస్తే వరి చేనుకు గాలి, వెతురు బాగా తగిలి పిలకలు అధికంగా వస్తాయి. ఎకరానికి నాలుగైదు బస్తాలు దిగుబడి పెరుగుతుంది. చీడ, పీడలను గుర్తించేందుకు, ఎలుకల బెడద నుంచి పంటను కాపాడుకోవచ్చు. మెరక, కాలువ శివారు భూముల్లో ఆలస్యంగా వరినాట్లు జరిగాయి. ఆ ప్రాంత రైతులు కాలిబాటలు తీసుకోవాలి.

– ఇమ్మిడిశెట్టి సత్య, ఏఓ, కరప మండలం

అధికారుల సూచనలు పాటిస్తున్నాం



వ్యవసాయశాఖ సిబ్బంది ఇచ్చే సూచనలు ప్రకారం ప్రతి ఏటా కాలిబాటలు తీయిస్తున్నాం. అదనంగా ఖర్చు అవుతున్నా ఉపయోగాలున్నాయి. ప్రతి రోజూ పొలంలోకి దిగి చేను ఎదుగుదలను, పంట తెగుళ్లను పరిశీలించి, దానికనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపడుతున్నాం. కాలిబాటలలో నడుస్తూ ఎరువులు చల్లడంవల్ల, రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నాను. ప్రతి వరిదుబ్బును చూడగలుగుతున్నాను.

– నక్కా వీరభద్రరావు, రైతు, కరప

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షుడు నానాజీ

బోట్‌క్లబ్: స్థానిక టౌన్ హాల్‌లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలు 33 మందికి శనివారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టౌన్‌హాల్ కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహణకు టౌన్ హాల్ కమిటీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. పాఠశాల విద్యను అభ్యసిస్తున్న 33 మంది బాలికలకు ఫీజుల నిమిత్తం రూ.70 వేలు అందజేశామన్నారు. ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఒక ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నానాజీ ఉపాధ్యక్షుడు గోలి రఘునాథ్, సంయుక్త కార్యదర్శి వీవీ సుబ్రహ్మణ్యం, కోశాధికారి సూర్యనారాయణ రాజు, కమిటీ సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సతీష్, నుసర్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రేపటి నుంచి సామవేదం ప్రవచనాలు

బోట్‌క్లబ్: సరస్వతీ గాన సభ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 22వ తేదీ వరకూ సమన్వయ సరస్వతీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యకళామందిరంలో ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రవచనాలు ప్రారంభమవుతాయన్నారు. 'సనాతన ధర్మ–శాశ్వత న్యాయం' అంశంపై ప్రవచనాలు జరుగుతాయన్నారు.

ప్రజా చైతన్యంతోనే స్వాతంత్య్ర ఉద్యమం



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాకినాడ సిటీ: ప్రజా చైతన్యంతోనే స్వాతంత్య్ర ఉద్యమ స్వప్నాలు సాకారం అవుతాయని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాత్రి కచేరిపేట యూటీఎఫ్ భవనంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 78 ఏళ్ల స్వతంత్ర్య భారతం సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వాస్కోడిగామా భారతదేశంలో అడుగుపెట్టిన నాటి నుంచి 1857 ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామం వరకు బ్రిటిస్ కంపెనీ పాలనపై వివిధ రూపాల్లో ప్రజలు పోరాడారన్నారు. 1947 స్వాతంత్య్ర సాధన ఉద్యమం అనేక ప్రవంతులుగా జరిగిందన్నారు. అనేక మతాలు, కులాలు, సాంప్రదాయాలు, భాషలు కలిగిన ప్రజలంతా మనమంతా భారతీయులమే అనే గొప్ప స్ఫూర్తితో ఉద్యమం సాగించారన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగం రూపొందించారన్నారు. పాలకులు విఫలమైనప్పుడు ప్రజా చైతన్యమే దేశాన్ని సరైన మార్గంలో నడిపిస్తుందన్నారు. అంబేడ్కర్ ఉద్యమనేత అయితాబత్తుల రామేశ్వరరావు, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర్‌వర్మ, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వాసంశెట్టి సోనీలు మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాట అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంజీ సూరిబాబు, జెవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరప: గొడ్డేటిపాలెం గ్రామానికి చెందిన కల్యాణీలక్ష్మి(40) భర్త పేరూరి శ్రీనివాస్ తనకు మద్దతుగా మాట్లాడలేదని మనస్తాపానికి గురైన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కరప ఎస్సై టి.సునీత తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 13వ తేదీన కల్యాణీలక్ష్మి పెద్దకుమారుడు జోసెఫ్ నవీన్‌కుమార్ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగివచ్చాడు. ఈ విషయమై కొడుకును ఎక్కడి వెళ్లావని తల్లి మందలించగా తల్లిపై కుమారుడు అగౌరవంగా మాట్లాడాడు. ఈ విషయమై తండ్రి శ్రీనివాస్ కొడుకును సపోర్టు చేస్తూ మాట్లాడడంతో మనస్తాపానికి గురైన కల్యాణీలక్ష్మి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వాంతులు చేసుకుంటున్న ఆమెను భర్త కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త పేరూరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న



సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ షణ్మోహన్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారులతో కలిసి కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతు సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. స్వాతంత్య్ర ఉద్యమ పోరాటంలో చురుకుగా పాల్గొని శ్రీకాకుళం, విజయనగరం ఇతర ప్రాంతాల ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం లిల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, సహాయ బీసీ సంక్షేమాధికారి పి రామకృష్ణ, కారపు ఊర్యశివ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతిని నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏఓ బీఎల్ నరసింహం సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనుపమ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుడు గౌతు లచ్చన్న సేవలను కొనియాడి, అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు బండారు మురళి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మెండు గోవిందు, ముద్రగడ రమేష్, పేకేటి దుర్గాప్రసాద్, వి.ముత్యాలరావు, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో గోకులంలోని శ్రీకృష్ణుడు



ఆలయానికి వచ్చిన భక్తులు



కరప విష్ణ్వాలయంలో శ్రీకృష్ణ వ్రతాలు చేస్తున్న మహిళలు



గోపిక వేషధారణలో చిన్నారి



కాకినాడ రూరల్ తిమ్మాపురంలో ఉట్టి వేడుక

బోట్‌క్లబ్: నగరంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణతో ఆలయానికి తీసుకొచ్చారు. స్థానిక అశోక్‌నగర్ గోకులంలో నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు గోకులం అధ్యక్షులు నారాయణం మురళి ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గోకులం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఇస్కాన్ అధ్యక్షుడు అనంత శేషదాసు వారి భక్త బృందం కృష్ణాష్టమి వైభవం, హరినామ సంకీర్తన ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక అచ్యుతాపురం గేటు సమీపంలో శ్రీకృష్ణుని మందిరంలో వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక రామారావుపేట శివాలయం సమీపంలో ఉన్న కృష్ణుని ఆలయంలోను, స్థానిక సినిమారోడ్డు సమీపంలో ఉన్న కృష్ణుని ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జేఎన్‌టీయూకే ఎదురుగా ప్రబోధ సేవా సమితి కాకినాడ శాఖ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. నగరంలో పలు కూడళ్లలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. యువకులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొన్నారు.

కరప: స్థానిక విష్ణ్వాలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రంలోని శ్రీరంగంలో చేసే విధంగా ఇక్కడ కృష్ణాష్టమి వేడుకలు చేయడం పరిపాటిగా వస్తోంది. ఆలయంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అదే ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి వార్లకు పూజలు చేశారు. అర్చకుడు గోపాలకృష్ణ 200 మంది మహిళలతో శ్రీకృష్ణ వ్రతాలను చేయించారు. విష్ణ్వాలయంలో రాత్రి సమయంలో ఉట్టుకొట్టి, భక్తులకు శ్రీకృష్ణునికి ఇష్టమైన అటుకులు, కాయం ప్రసాదాలను పంపిణీ చేశారు. దేవదాయశాఖ ఈఓ కె.తిరుమల రవితేజ, సీహెచ్ శ్రీను, గ్రామస్తులు శ్రీకృష్ణాష్టమి వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెనుగుదురు, కూరాడ, జెడ్.భావారం, యండమూరు తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి పూజలు నిర్వహించారు.

కాకినాడ రూరల్: మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పలు గ్రామాల్లో శ్రీకృష్ణ ఆలయాలు, విష్ణు ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. చిన్నారులను గోపిక, కృష్ణుడి వేషధారణలో ఉట్టు కొట్టు కార్యక్రమాలు నిర్వహించారు. తిమ్మాపురం విష్ణు ఆలయం, వలసపాకల కృష్ణ ఆలయం, పలు గ్రామాలలో ఆలయాలతో పాటు పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. భక్తులు భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమికి పూజలు చేశారు.

ఇవండీ సంగోతులు



చినుకు పడితే ప్రమాదకరంగా ఆర్‌బీ పట్నం–మేడపాడు రహదారి

- గోతులమయంగా ప్రధాన రహదారులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

పెద్దాపురం: రహదారులు గోతులమయంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలు, కంకర రాళ్లతో అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి అధికారం చేపడితే రహదారులు మారుపోతాయి. అడుగు నేలపైన పెట్టకుండా, తడవకుండా, గోతిలో పడకుండా రహదారులకు ప్రాధాన్యతనిస్తారనుకున్న నియోజకవర్గ ప్రజల ఆశల అడియాశలయ్యాయి.

మండలంలోని ప్రధాన రహదారులు ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోకపోడంతో భారీ గుంతలు ఏర్పడి వర్షం వస్తే చెరువు తలపిస్తున్నాయి. కంకరరాళ్లు తేలడంతో రహదారిపై వెళుతున్న ఆటోలు, ఇతర వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయి.

అధ్వానంగా ప్రధాన రహదారులు

నిత్యం రద్దీగా ఉండే పిఠాపురం–దివిలి ప్రధాన రహదారిలో స్థానిక మండల పరిషత్ పాఠశాల సమీపంలో గుంతలు పడడంతో ప్రయాణికులకు నరకం చూస్తున్నారు. చినుకు పడితే గోతులలోకి నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో భారీ వాననాలు చాలా జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇక ఆటోల్లో ప్రయాణించేవారు, ద్విచక్ర చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అదే విధంగా పులిమేరు–గుడివాడ, ఆర్‌బిపట్నం –చిన బ్రహ్మదేవం, చదలాడ–ఉలిమేశ్వరం, గోరింట–పులిమేరు గ్రామాలకు వెళ్లే రహదారులు మరింత దారుణంగా ఉన్నాయి. రోడ్డు నిర్మాణాలను కొన్ని చోట్ల అసంపూర్ణంగా వదిలేయడంతో రాళ్లు పైకి తేలి ప్రయాణికులను బుడిద చుట్టిముడుతోంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర సేవలకు తిప్పలు

భారీ గుంతల కారణంగా అత్యవసర సేవలందించే 108 వాహనాలు సకాలంలో చేరుకోలేకపోతున్నాయి. రోడ్లు గోతులతో అస్తవ్యస్తంగా మారినప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు ఆయా రహదారులు నిర్మాణానికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు త్రీవ ఇబ్బందులు పడుతున్నారు.

భయం భయంగా ప్రయాణాలు

దివిలి నుంచి పిఠాపురం రహదారిలో చాలా గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులో దివిలి ఎంపీయూపి స్కూల్ సమీపంలో పెద్ద గుంత ఉంది. వాహనదారులు నిత్యం చిక్కుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం కురిస్తే ప్రయాణాలు చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది.



అధ్వానంగా తయారైన చదలాడ–ఉలిమేశ్వరం రహదారి



చదలాడ–ఉలిమేశ్వరం రహదారిలో గుంతుల్లో చేరిన వర్షపునీరు